


# తాకట్టు

ప్రధానమంత్రి ఇరవై సూత్రాల పథకంను యథాలాపంగ చదువుకుపోతున్న కలెక్టరు 'సూరి' నాలుగో సూత్రం తనను కట్టేసినట్లు చూస్తూండిపోయాడు. ఎగసి పడే గుండెపై చెయ్యివేసి మళ్ళీ మళ్ళీ చదివాడు

'బాండెడ్ లేబర్ (వెట్టిచాకిరి) రద్దు, ఇంకా అమలుపరుస్తున్నవారిని చట్టాన్ని వ్యతిరేకిస్తున్నందుకు వారిని శిక్షించవచ్చు' ప్రధానమంత్రికి జోహార్లు అర్పిస్తూ లేచాడు వెంటనే తన సిబ్బందితో 'పూతనపల్లి'కి ప్రయాణమైనాడు.

రోడ్డుపై కారు దూసుకుపోతుంటే గిరులు-తరులు వెనక్కి పరుగెట్టుతున్నాయి. కలెక్టరు 'సూరి' ఆలోచనలు వాటి వెంటబడ్డాయి

* * *

చెలమయ్యకు వుంటానికి ఇల్లు-రెండెకరాల భూమి వున్నాయి. సంవత్సరానికి సరిపడే తిండిగింజలకోసం ఆ కుటుంబ సభ్యులందరూ కష్టపడుతారు. ఒక రోజు చెలమయ్య చెల్లెలు యాదమ్మ రెండెడ్ల బండిలో మంచానపడిన భర్తతో పదేళ్ళ కొడుకు సూరీడుతో వచ్చింది. మరెక్కడికీ వెళ్ళే దారిలేక తనను వెతుక్కుంటూ వచ్చిన చెల్లెలను భరించటం తన బాధ్యతగా ఎంచి ఆదరించాడు.

కష్టాలన్నీ కూడబలుక్కుని వస్తాయన్నట్లు ఆ సంవత్సరం వర్షాలులేక పంట ఎండిపోయింది. రెక్కల కష్టం మీద నమ్మకం వున్న చెలమయ్య కూలి

నికి తగిన ఫలితం దక్కలేదు.

సగం కడుపుతో వున్నా 'దేహి' అని మరో ఇంటికి అప్పుకు వెళ్ళలేదు. ఆకలిని నీళ్ళతో మభ్యపెట్టుకోగలిగారు కాని, జబ్బుతో వున్న చెల్లెలి భర్తను మభ్య పెట్టలేకపోయాడు.

అతనికి క్షయవ్యాధి అన్నారు. ఖరీదైన మందులు, పుష్టికరమైన తిండి ఇవ్వాలన్నారు. జబ్బుతో కృశించిపోతున్న అతను మరొకరికి బరువుగా వుండలేక ఆత్మహత్యకు ప్రయత్నించాడు. భర్తను చుట్టేసుకుపోయి ఏడుస్తున్న చెల్లి కంటి నీరు తుడిచి చెలమయ్యా నేరుగా చౌదరి ఇంటికి వెళ్ళాడు.

కరువుకాటకాలు ఆ ఇంటిని ఏమీ చేయలేనంత కట్టుదిట్టంగా వుంది ఆ మిద్దె ఇల్లు

చౌదరిగారు కడుపునిండుగ భోజనం చేసిన తృప్తితో వాలుకుర్చీలో కూర్చుని మూరేడు పుగాకును వాసన చూసి తలూపుతూ చుట్టగా మలుస్తున్నాడు. అల్లంత దూరంలో చేతులు కట్టుకుని నిల్చున్న చెలమయ్యను చూసి "ఎవ్వరూ! చెలమయ్యా! ఏమిటీ, వూడిపడ్డావ్." అన్నాడు.

కరువుతో కడుపులు కరకరలాడేది బీదలే వరదలొచ్చి కొట్టుకుపోయేది బీద ప్రజే! సూర్యుడితో లేచి, సూర్యాస్తమయం వరకు నడుంవంచి చెమటోడ్చి పనిచేసినా కడుపునిండదే! చల్లని నీడలో సోమరిగా కూర్చుని బొజ్జలు పెంచుకున్న వాళ్లు! గొప్పగా జీవిస్తారు. మనుష్యులే పడుతుంది. ఎక్కడ ధర్మం? అది ఆలోచిస్తూ తన కష్టాలను ఏకరువు పెట్ట సాగాడు చెలమయ్య. ఆ మాటలు ఆప మన్నట్టుగా చెయ్యి ఎత్తాడు చౌదరి.

"కాలయాపన చేయక వచ్చినపనేంటో తేల్చు!' అన్నాడు.

"డబ్బు కావాలి "

"తాకట్టుకు ఏం తెచ్చావ్?"

"నా దగ్గర ఏముందో తమరికి తెలియనిది కాదు. రెండెకరాల భూదేవి, ఇల్లు."

నింపాదిగ పొగ వదులుతూ "తంతే కూలిపోయే నీ గుడిసే. నీరాళ్ళభూమి నేనేం చేసుకోను!" తలెగురవేశాడు.


వాస్తు శాస్త్రప్రకారం ఏదో లోపం వుందని తెలిపి బంగారంలాంటి సిమెంటు మిద్దెలు మూడు పడగొట్టాడు. వూళ్లోఉన్న మంచిపొలాలన్నీ వారివే! తలసంచుకున్నాడు చెలమయ్య.

"అప్పు ఎలా తీరుస్తావు?"

ఆశగా తలెత్తి తన చేతి కండరాలను వుబ్బించి, 'నా రెక్కల కష్టంతో అప్పు తీర్చుతా'నన్నాడు. చౌదరి సాలోచనగా తలూపుతూ,"అదే,తాకట్టుపెట్టు"అన్నాడు.

అర్థంకానట్టు చూశాడు చలమయ్యా.

అదేనోయ్! ఇంట్లోపనికి ఇబ్బంది పడుతుంది ఇంటావిడ. పెద్దింటి చాకిరి రాత్రింబవళ్ళు వుంటుంది. ఒక్కసారి ఆ ఇంటి గడప తొక్కితే అంకితమైపోయి నట్లే. పెళ్ళికావలసిన ఆడపిల్లలను ఆ ఇంటికి పంపలేదు. ఇంటి ఇల్లాలును పరాయి గడప తొక్కనిస్తాడా! తనొస్తే,




తన కుటుంబాన్ని ఎవ్వరు సంభావించు కుంటారు? ఈ ఇంటి వూడిగానికి ఎవర్ని పంపాలి?

'చంద్రం తన పదకొండేళ్ళ కొడుకు- పుస్తకాలు పట్టుకొని శ్రద్ధగా బడికెళ్లే సుపుత్రుడు కళ్లెదుట నిల్చాడు.

ఆ రోజు చద్దిఅన్నం తిని సూరీడు భుజంపై చెయ్యివేసి బడికి బయలుదేరిన చంద్రంని చౌదరి ఇంటికి తీసుకొని పోతుంటే చంద్రం తల్లి పోర్లాడి పోర్లాడి యేడ్చింది. చెలమయ్య చెల్లికాళ్ళకి అడ్డు తగిలింది. "అన్నయ్యా! శనిలా నీ ఇంట్లో దూరాము. తాకట్టుకి సూరీడును పంపు అదే న్యాయం" అని దుఃఖంతో నేల కంటుకుపోయింది.

పుస్తకాలను ఎదకు అదుముకొని బిక్కు బిక్కుమని చూస్తున్న సూరీడును పొమ్మనటానికి మనస్సాక్షి వప్పుకోలేదు.

"ఎందుకే ఏడుస్తారు! ఏమొచ్చిందని! దేముడు చల్లగా చూడాలేగాని ఆ అప్పు ఇట్టే తీర్చేయనూ! మరో ఆరునెలలకి మన చంద్రం మనింటికి వస్తాడు." అని వారికి ధైర్యంచెప్పుతూ తనను తాను వోదార్చు కుంటూ చంద్రాన్ని చౌదరి ఇంట్లో వదలి వచ్చాడు. తెలివిగల చంద్రం ఆడపని, మొగపని ఇట్టేచేసేవాడు. రాత్రిళ్ల అందరు నిద్రపోయాక అలసిన శరీరం విశ్రాంతి కోరుతున్నా పరుగు పరుగున ఇంటికి వెళ్ళి అమ్మని చూసుకొని వచ్చేవాడు.

ఆరునెలల్లో తీర్చుతానన్న అప్పు ఆరు సంవత్సరాలైనా తీర్చలేకపోయాడు. సరికదా, అదనంగ మరికొంత అప్పు తీసుకున్నాడు. ఒకసారి అప్పుతీసుకోవడం వూబిలోకి దిగటం లాంటిది. యాదమ్మ తనభర్త ప్రాణాలను ఓదరి చేర్చినందుకు చెలమయ్య పాదాలను కన్నీటితో కడిగి,

బ్రతుకుతెరువుకోసం పట్టణానికి బయలు దేరింది. నాలుగిళ్ళల్లో పనిచేసి కొడుకుని, భర్తను, పోషించేది యాదమ్మ. సూరీడుకు చదువు అబ్బింది. మంచి బ్రతుకుండా లంటే చదువు ముఖ్యమన్న విషయాన్ని చిన్ననాడే గ్రహించాడు. సూర్యం తల్లి కష్టంతోనే యం. ఎ. చేసి, లెక్చరర్‌పని చేపట్టాడు. తను ఏ మాత్రం సుఖం అను భవిస్తున్నా తన కళ్ళకి చంద్రం కనిపించే వాడు.

చదువుకొని తనంతటి వాడు కావలిసిన చంద్రం నిద్రతో కళ్ళు కూరుకుపోతున్నా ఆవలిస్తూ చౌదరి కాళ్ళు పట్టే చంద్రం గుర్తుకు వచ్చేవాడు. పైసా, పైసా, కూడేసి, చంద్రాన్ని తాకట్టునుంచి వదిలించాలన్నదే. తన జీవిత ధ్యేయంగా పెట్టుకున్నాడు. తల్లిపోరుతున్నా పెళ్ళిచేసు కోలేదు.

సంపాదిస్తున్న ఉద్యోగస్తునికి మంచి పెళ్ళి సంబంధాలు రాసాగాయి. పిల్లకి ఏ కాస్త వంకరవున్నా, కట్నం ధర ఎక్కువ పలుకుతున్నారు పోలియోతో కాలు వంకరై కుంటుతున్న అమ్మాయిని చేసుకొంటే ముప్ఫయి వేలు ఇస్తామన్నారు. చేసుకుంటానన్నాడు సూరి. తల్లి వద్దని పోరుపెట్టింది. 'నాకు వచ్చిన కష్టం ఏమంది' చంద్రంలా ఒకరింటికి తాకట్టుగా వెళ్ళి వూడిగం చేయటలేదు " అని తల్లి నోరు కట్టేసి ఇష్టంగ కుంటిపిల్లను పెళ్లాడి నాడు.

కట్నం డబ్బుతో చౌదరి ఇంటికి వెళ్ళాడు. తనకున్నదంతా చెల్లించి చంద్రంని స్వతంత్రునిగా చేసి తృప్తితో కంటినిండుగా నిద్రపోయాడు సూరి.

ఆ తృప్తి రెండురోజులు కూడ మిగులలేదు. బలంవున్న వాడిదే రాజ్యం మానవుడి స్వార్థానికి అంతులేదు. చలమయ్య పొలం, ఇల్లు తాకట్టులో వున్నట్టు సృష్టించిన పత్రాలను చూపిం చాడు. పదిమందిని కర్రలతో చెలమయ్య ఇంటిపైకి పంపాడు చౌదరి


పశువును ఈడ్చుకొచ్చినట్లు చంద్రంను తెచ్చి పశువుల పాకలో పడేశారు. చలమయ్య ఆర్తనాదం ఆ వూరు దాట లేదు.

స్వతంత్రం దేశానికేగాని అందులోని ప్రజలకు కాదు. బానిస బ్రతుకు తనకు తప్పదు ఎవ్వరి ఖర్మను ఎవ్వరు తప్పి స్తారు' యంత్రంలా పనిలోకి చొరబడ్డాడు చంద్రం.

సూరీడు హతాశుడై పోయాడు. ఈ అధ్యాయాలను అరికట్టేది ఎవ్వరు! ఎవ్వరు? ప్రయత్నించినా ఫలితం వుండదని నిట్టూ ర్చాడు సూరి. చౌదరి వుద్యోగస్తులను కొనేస్తాడు నాయకులకి మంత్రి పదవి కొనిస్తాడు (తన మనుష్యులను మంత్రు లుగాచేయటానికి డబ్బును వెదజల్లుతాడు.)

అందులో ఏ ఒక్కటి తాను చేయ లేడు ఈ భారత భూమిని ఆ దేవుడొక్కడే రక్షించగలడు.' సూరి రెండు చేతులు జోడించాడు.

చౌదరి ఎంతో వుదారంగ చంద్రంను పెళ్ళిచేసుకోమన్నాడు. చౌదరి వుదారంలో ఎంత స్వార్థం వుందో చిన్నప్పటి నుండి చూస్తున్న చంద్రం "నాకేంటీ పెళ్ళి బాబయ్యా" అన్నాడు జీవంలేని నవ్వుతో.




తనకలా ఓ భార్య పిల్లలు వుండాలన్న కోరిక ఎంత బలంగావున్నా తన భార్య బిడ్డలను బానిసత్వానికి వారసులుగా చేయ లేరు. ఈ వెట్టి చాకిరి తనతోనే పోవాలి. దృఢనిశ్చయంతో బ్రహ్మచారిగా వుండి పోయాడు.

మన ఇంటిపేరు నీతోనే పోతది. ఓ ఇంటివాడవై కొడుకుని కని చలమయ్య ఇంటిపేరు నిలబెట్టాలి. అని చంద్రం చేతులు పట్టుకున్నాడు.

చంద్రం పకపక నవ్వాడు. "నెహ్రూ అంతటి వాడికే ఇంటిపేరు మీద వంశం మీద వ్యామోహం లేదు. నాన్నా మనం మట్టి మనుష్యులం భూస్వాముల చేతిలో కీలుబొమ్మలం మనకెక్కడిదీ వంశం ..." అన్నాడు.

అంత తెలివిగా స్వచ్ఛంగ మాట్లాడే చంద్రం చదువుకోనిచ్చి వుంటే కలక్ట రయ్యేవాడు. ఆ మాట అన్నాడు చంద్రంతో అన్నాడు. 'చదువులేనివాడు మంత్రి అవుతాడు' అతిహసితం చేస్తూ చౌదరి ఇంట్లోకి వెళ్లాడు. చలమయ్య కళ్లొ వత్తుకున్నాడు.

కొమ్మ అందిస్తే చెట్టుఎక్కే సూరి. ఐ. ఎ. యస్ పరీక్షఅయి, స్వంత జిల్లాకి కలెక్టరుగా వచ్చాడు.

ప్రభుత్వం జారీచేసిన చట్టాన్ని చౌదరికి చూపించి, చంద్రంని తీసుకుని కారు ఎక్కాడు సూరి.

వెట్టిచాకిరితో కృషించిపోతున్న ఎన్నో కుటుంబాలు స్వతంత్రగాలులు పీల్చు కున్నాయి. ***